తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శనివారం 16 మే 2026
పేజీలు : 8
Follow :



## నార్కోటిక్ స్నిఫర్ డాగ్‌తో..
### బస్‌స్టేషన్‌లో వన్‌టౌన్ పోలీసుల విస్తృత తనిఖీలు..



**గోదావరిఖని, జనంసాక్షి:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్టాండ్ ప్రాంతం, కార్గో పార్సిల్ కేంద్రాలు, దుకాణాలు, పాన్‌షాపులు, బస్సుల్లో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, నార్కోటిక్ వింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజ్‌కుమార్ సమన్వయం తో శుక్రవారం నార్కోటిక్ స్నిఫర్ డాగ్ సహాయంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ గంజాయి సరఫరా, వినియోగాన్ని నియంత్రించడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, నార్కోటిక్ స్నిఫర్ డాగ్‌లతో కూడా ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. తనిఖీలలో బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద ఉన్న బ్యాగ్ దగ్గరకు స్నిఫర్ డాగ్ వెళ్లి వాసన చూడడంతో అతడిని తనిఖీ చేయగా, బ్యాగ్‌లో పొగాకు (తంబాకు) ప్యాకెట్ లభించిందని సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయిస్తున్నా ప్రత్యేక శిక్షణ పొందిన ఈ డాగ్ క్షణాల్లో గుర్తించే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు, చిన్నపిల్లలకు మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు, గుట్కా, సిగరెట్లు వంటి నిషేధిత వస్తువులు విక్రయించిన పక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికుల బ్యాగులు, అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. గంజాయి, మత్తు పదార్థాలు బస్సులు, రైల్వే మార్గాలు, ప్రైవేట్ వాహనాలు, కార్ల ద్వారా తరలిస్తున్నారని తెలిపారు. ప్రయాణికులు బస్సులు, రైళ్లలో ప్రయాణించే సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా బ్యాగులతో కనిపించినా, మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ టీమ్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, నార్కోటిక్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.



## కొండెక్కిన కోడి..

**ముస్తాబాద్ మే 15 (జనంసాక్షి)**
పెరిగిన చికెన్ ధరలుస్కిన్‌లెస్ రూ. 330, బోన్‌లెస్ రూ. 640చికెన్ ధరలు రోజు రోజుకూ ప్రియమవుతున్నాయి. వారం రోజుల నుంచి ధరలు క్రమంగాపెరుగుతున్నాయి. వారం క్రితం స్కిన్‌లె?స చికెన్ కిలో రూ. 250-285 ఉండగా, ప్రస్తుతం రూ. 330కి చేరింది. దీంతో కిలో, రెండు కిలోలుకొనేవారుఅరకిలోతోసరిపెట్టుకుంటున్నారు. మటన్ కొందామన్నా కిలో రూ. 1,000 నుంచి రూ. 1,200 ఉంది. ఎండలు, పెళ్లిళ్ల సీజన్, సరఫరా తగ్గడం, డిమాండ్ పెరగడంతో చికెన్ ధరలు భారీగా పెరిగాయని, జూన్ నెలాఖరు వరకు ధరలు ఇలానే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం చికెన్ ధరలు ఇలా. చికెన్ లైవ్ బర్డ్ - రూ. 190,210 స్కిన్‌తో , రూ. 210-220,స్కిన్‌లెస్ - రూ. 330 బోన్‌లెస్ ,రూ. 640-660,గుడ్లు (డజన్) - రూ. 72,80.

## మాదిగలకు రాజకీయ అవకాశం కల్పించిన పార్టీనే ఆదరిస్తాం..!

- మాదిగల చైతన్యం కోసమే మాదిగ శక్తి సంస్థను స్థాపించాం
- మాదిగల ఓటు మాదిగలకే అనే నినాదంతో ముందుకెళ్తాం
- మాదిగ మహాశక్తి కోర్‌కమిటి సభ్యుడు అసంపల్లి శ్రీనివాస్




**మంథని, ( జనంసాక్షి ) :**
తెలంగాణ రాష్ట్రంలో 70లక్షల మంది మాదిగలు ఉన్నా రాజకీయంగా అణగదొక్కుతున్నా రని, రాజకీయ అవకాశం కల్పించిన పార్టీనే ఆదరిస్తామని మాదిగ మహాశక్తి కోర్ కమిటి మెంబర్ అసంపెల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒక్కో నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది ఓటర్లుగా మాదిగలు ఉన్నా రాజకీయ అవకాశాలు కల్పించడం లేదని ఆయన వాపోయారు. ఎంపీటీసీ సర్పంచ్‌లుగా టికెట్ ఇవ్వడం లేదని, జెడ్పీటీసీలుగా ఏ పార్టీ గుర్తించడం లేదన్నారు. ఇక ఎంపీ, ఎమ్మెల్యేల పరిస్తితి చూస్తే దేశ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు కూడా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో తీరని అన్యాయం మాదిగలకు జరుగుతోందన్నారు. రాష్ట్రంలో మూడు ఎంపీ స్థానాలు ఉంటే మూడింటిలో ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే స్థానాల్లో కూడా తీరని అన్యాయం చేసిండ్లని ఎమ్మెల్సీ స్తానం ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వలేదన్నారు. 70 లక్షల మంది మాదిగల రిప్రెంజటేషన్ పార్లమెంట్‌లో అవసరం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఇంతటి జనాబా కల్గిన మాదిగల ఓట్లతోనే కదా గెలిచిందని ఆయన ప్రశ్నించారు. ఈ క్రమంలో మాదిగలను చైతన్యం చేయడానికి మాదిగల ఓటు మాదిగలకే అనే నినాదం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఏ పార్టీ మదిగలను గుర్తిస్తదో పార్టీలకు అతీతంగా ఉండి పార్టీకి మద్దతు ఇస్తామని, ఏ పార్టీ మాదిగలకు టికెట్ ఇస్తదో అ పార్టీకి ఓటు వేసి మా అభ్యర్తిని గెలిపించుకుంటమని తెలిపారు. మాదిగలను గుర్తించి గౌరవప్రదమైన పదవిలో పెడుతదో ఆపార్టీ పక్షాన నిలబడటానికి రెడీగా ఉన్నట్లు ఆయన చెప్పారు. మాదిగలను ఏ పార్టీ అణగదొక్కాలని చూస్తుందో ఆ పార్టీ అంతు చూస్తమని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం మాదిగ మహాశక్తి అనే సంస్థను మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మాదిగల ఓటు మాదిగలకే అనే నినాదంతో ఓట్లు మావి అయితే సీట్లు ఎట్లా మావి అయితయని అని ప్రశ్నిస్తూ 15 నియోజకవర్గాల్లో పోటీ

మిగతా 2లో

## యూనియన్ ప్రతినిధులు..ఉత్తమ కార్మికులతో..
### - మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్ సమావేశం..




**గోదావరిఖని, జనంసాక్షి:**
రామగుండం ఏరియా-1లోని జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్ (ఎండీటీ) ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, ఉత్తమ కార్మికులతో ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే మల్టీ డిపార్ట్మెంట్ సమావేశం సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యస్ఓటు జియం కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో కార్మికుల పాత్ర కీలకమని కొనియాడారు. బొగ్గు ఉత్పత్తి పెంపుదల, యంత్రాల పనితీరు, ఉత్పత్తి వ్యయం తగ్గించడం, భద్రతా ప్రమాణాల పాటించడం వంటి అంశాలపై సుదీర్ఘంగా గుర్తింపు సంఘం యునియన్ ప్రతినిధులతో చర్చించారు. (మే 18) వివిధ గనుల వద్ద క్షేత్రస్థాయిలో ఈసమావేశాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఏజీఎం(ఐఇడి) అంజనేయులు, మల్టి డిపార్ట్మెంట్ కమిటీ సభ్యులు వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణిలోని గనులు వాటి పనితీరు గురించి వివరించారు. ఉత్పత్తి ఉత్పాదకత, బొగ్గు రవాణా, నెలల వారిగా నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించడానికి ప్రణాళికల గురించి వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్‌జీ-1 ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి పెంపునకు తీసుకోవలసిన ప్రణాళికల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి గుర్తింపు సంఘం నుంచి మడ్డి ఎల్లయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ, రంగు శ్రీను, ఏజిఎం (ఐఇడి) ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, రాజన్న, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేష్, బ్రహ్మాజిరావు, అధికారులు, యూనియన్ ప్రతినిధులు, ఏరియా ఉత్తమ కార్మికులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు లైబ్రరీ దినోత్సవ వేడుకలు



**కరీంనగర్ బ్యూరో, మే 15 (జనంసాక్షి) :**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ విద్యా వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు లైబ్రరీ దినోత్సవ వేడుకలు కరీంనగర్‌లో ఘనంగా జరిగాయి. శుక్ర వారం రోజు జిల్లా గ్రంధాలయం చైర్మన్ సత్తు మల్లేషం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి, లోకల్ బాడీ అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సర్వతీమాత చిత్ర పటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలనం చేస్తూ, గ్రంథాలయ దినోత్సవ వేడుకలను ప్రారంభం చేశారు. అనంతరం కుండిల్లో మొక్కలు నాటి పుస్తక ప్రదర్శనను వీక్షించారు. ఈ సంధర్బంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... స్మార్ట్ సిటీ నిధుల ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే విద్యార్థులకు సహకారం అందిస్తామని తెలిపారు. 7 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. నగర పాలక సంస్థ నుండి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడం లో ముందం టామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థాని క కార్పొరేటర్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ

**ఎల్లారెడ్డిపేట, మే 15, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ గడ్డం నగేష్, ఎల్లారెడ్డిపేట తహశీల్దార్ సుజాత పరిశీలించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున త్వరగా తూకం వేసి కొనుగోలును వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహకులు చూసుకోవాలన్నారు. వారి వెంట ఆర్ఐ శ్రావణ్, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డిజిల్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం మోసం చేసింది

### సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి



**ఎల్లారెడ్డిపేట, మే 15, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట, బండలింగంపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాల సందర్భంగా శుక్రవారం కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలు పెంచి దేశ ప్రజలను మోసం చేసిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభిస్తూ కేంద్ర ప్రభుత్వం మొన్నటి వరకు ఐదు రాష్ట్రాల ఎన్నికలు ఉన్నాయని పెట్రోల్, డిజిల్ ధరలు పెంచకుండా ఇప్పుడు పెంచడం శోచనీయమన్నారు. ప్రధానమంత్రి మోడి భారతదేశాన్ని అమెరికా ట్రాంప్ సర్కారుకు దాసోహం చేయడం జరిగిందన్నారు. ముందు చూపు లేనటువంటి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డిజిల్ నిలువలను పెంచలేక పోయిందన్నారు. మరోవైపు వంటగ్యాస్ ధరని కూడా పెంచి సామాన్యుని నడ్డి విరవడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది మరొకలా ఉందని ఆయన అన్నారు. ఇందిరమ్మ లబ్దిదారులకు కేకే మహేందర్‌రెడ్డి నూతన వస్త్రాలను అందించారు. జూన్ 2 తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు అర్హత కలిగిన పేద ప్రజలందరికి అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సాబేర బేగం, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండాటి రామ్‌రెడ్డి, రాజన్నపేట సర్పంచ్ బాపురెడ్డి, బండలింగంపల్లి సర్పంచ్ నర్సాగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు మెండే శ్రీనివాస్, గుర్రాల రాజిరెడ్డి, ఎల్లాగౌడ్, ముక్క శంకర్, సురేందర్, రమేష్, గంట బుచ్చగౌడ్, సంజీవరెడ్డి, ఇమాం పాల్గొన్నారు.

## ఇంటర్ మొదటి సంవత్సరనికి దరఖాస్తులు ప్రారంభం

### - డా. గోల్డీ బాల్బీర్ కౌర్

**సుల్తానాబాద్,మే 15(జనంసాక్షి) :**



తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ గర్రెపల్లి నందు 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డా. గోల్డి బాల్బిర్ కౌర్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థులు అధికారిక వెబ్ సైట్ హెచ్‌టిటిపిఎస్://టిజిఎంఎస్. తెలంగాణ.జిఓవి.ఐఎన్ ద్వారా ఆన్లైన్లో ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీసీ బైపీసీ సిఇసి ఏసీఈ ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నట్లు అదేవిదంగా ఆన్లైన్ అప్లికేషన్ ను కళాశాలలో సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## రాష్ట్ర రహదారి-7 పై రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి

**- ఫోర్ లైన్ రహదారిగా విస్తరించాలి**

**- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము రాంబాబు యాదవ్**

**ఎండపల్లి, జగిత్యాల జిల్లా, జనంసాక్షి :**



రాష్ట్ర రహదారి -7 రోడ్డుపై రాయపట్నం నుండి కరీంనగర్ వరకు ఇటీవలి కాలంలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం పట్ల బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము రాంబాబు యాదవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి యమపురికి దారిగా మారిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని ఆరోపించారు.మొన్నటికి మొన్న అంబారిపేట బస్టాండ్ వద్ద, నిన్న రాయపట్నం వద్ద జరిగిన ఘోర ప్రమాదాలే రోడ్డు పరిస్థితికి నిదర్శనమన్నారు. గుంతల మయమైన రోడ్డుపై ప్రయాణిస్తున్న ఎంతోమంది పేదలు ప్రాణాలు కోల్పోతుంటే, కొందరు శాశ్వత వికలాంగులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రహదారిపై పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఈ రహదారికి తక్షణమే ఫోర్-లేన్ మంజూరు చేసి, ప్రమాదాల నివారణకు రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అంబారిపేట, రాయపట్నం ప్రమాద బాధితులను ప్రభుత్వం శాశ్వత ప్రాతిపాధికన ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రోడ్డు ప్రమాద బాధితుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రాంబాబు యాదవ్ హెచ్చరించారు.

## పోక్సో నిందితుడిని కాపాడుతున్న కేంద్ర ప్రభుత్వం..

**- బాధితురాలు కుటుంబానికి అన్ని వర్గాలు అండగా నిలబడాలి..**
**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి..**
**- బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి..**
**- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ ఉమ్మడి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్..**

**గోదావరిఖని, జనంసాక్షి:**




ఎన్టీపీసీ సెంటర్‌లో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ మాట్లాడుతూ మైనర్ బాలికకు బలవంతంగా డ్రగ్స్ తాగిపించి అత్యాచారం చేశాడని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై హైదరాబాద్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఈనెల 8వ తేదీన పోక్సో కేసు నమోదు అయిందన్నారు.ఈ కేసు నమోదై మూడు రోజులు కావస్తున్న పోలీసులు ఇప్పటివరకు బండి భగీరథపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు.పోక్సో నిందితుడిని కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం అనేక అవస్థలు పడుతున్నదన్నారు.పోక్సో కేసు నమోదైతే వెంటనే అమ్మాయి వాయిస్‌ను జడ్జి ముందు రికార్డు చేయాలన్నారు. నేరారోపణ ఎదుర్కొంటున్న నిందితుడిని వెంటనే అరెస్టు చేసి విచారించాలని నిబంధనలు ఉన్నా పోలీసులు అటువంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. గతంలో కూడా బండి సాయి భగీరథ చదువుకుంటున్న కాలేజీలో విద్యార్థుల్ని ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేశాడని, భౌతిక దాడులకు పాల్పడ్డాడని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయన్నారు.అటువంటి ఘటనలకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సాక్షదారాలుగా పెద్ద ఎత్తున వచ్చాయన్నారు.ఇప్పుడు మైనర్ బాలికను హత్యాచారం చేశాడని కేసు నమోదు అయిందన్నారు.
ఈ కేసు నుండి తప్పించుకోవడం కోసం బండి సాయిభగీరథ కరీంనగర్‌లో సదరు బాలికపై హనీ ట్రాప్ చేసిందని కేసు పెట్టడం ఆక్షేపనీయమన్నారు.ఆరోపణలను చట్టం ముందు ధైర్యంగా ఎదుర్కోవడం చేతకాక ఇలాంటి కౌంటర్ కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. బండి సంజయ్ అతని కుమారుడు భగీరథ తన ఆర్థిక, రాజకీయ, అంగ బలాన్ని ఉపయోగించి ఈ కేసును ఎలా మాఫీ చేయాలని తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నారన్నారు.సాక్షాత్తు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ తన కుమారుడిపై మైనర్ బాలికపై అత్యాచార ఆరోపణలు వస్తే స్వచ్ఛందంగా ఆ పదవికి రాజీనామా చేయాల్సింది పోయి అదొక రాజకీయ కుట్ర అని ప్రకటించడం తన బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మడి వెంకన్న, ఈసంపల్లి రాజేందర్,గొల్లపల్లి చంద్రయ్య, ఆడెపు శంకర్, కలవల రాయమల్లు,పుల్లూరి నాగభూషణం, చిలక రాజు, రాజయ్య, క్రాంతి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలకు రాజకీయ అవకాశం కల్పించిన పార్టీనే ఆదరిస్తాం..!

చేసేందుకు మాదిగలను సమీకరిస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో మాదిగల మహాశక్తి ఆత్మీయ సమ్మెళనం పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్‌లో ఈ నెల 17న ఏర్పాటు చేసినట్లు ఈ సమావేశానికి మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రామగుండం మున్సిపల్ చైర్మన్ మహంకాళి స్వామితో పాటు తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. పార్లమెంట్ స్థాయిలో ఉన్న పెద్దపల్లి, ధర్మపురి, మంథని, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, పరిధిలోని మాదిగలను ఏకం చేసి సముచిత న్యాయం జరిగేలా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంథని పరిధిలోని మాదగలు ఈ ఆత్మీయ సమావేశాని పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు అసం తిరుపతి, బత్తుల శంకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సింగిల్ ఫేస్ నియంత్రిక ప్రారంభం

### సెస్ ఏఈ, కాంగ్రెస్ సిరిసిల్ల ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి



**ఎల్లారెడ్డిపేట, మే 15, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండలంలోని రాగట్లపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సింగిల్ ఫేస్ నియంత్రికను సెస్ ఏఈ పృథ్విగౌడ్, సిరిసిల్ల నియోజవకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. గత పది సంవత్సరాల నుండి బీరప్ప దేవాలయానికి విద్యుత్ సరఫర లేదని, రాగట్లపల్లి గ్రామ సర్పంచ్ నెత్తట్ల లక్ష్మయ్య, కేకే మహేందర్‌రెడ్డికి బీరప్ప దేవుని వేడుకలు ఉన్నాయని, విద్యుత్ సరఫర కావాలని అడుగగానే వెంటనే స్పందించిన కేకే మహేందర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డిఈ, ఏడిలతో మాట్లాడి వారం రోజుల్లో ఈ పనిని పూర్తిచేయించారు. 2లక్షల 50 వేల రూపాయల విలువగల ఎనిమిది స్థంబాలను ఒక డిటిఆర్‌ను బిగించి ఆలయానికి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. దీనికి సహకరించిన ఎండి, డిఈ, ఏడిలకు కేకే మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బీరప్ప దేవాలయం కళ్యాణ మహోత్సవాలను ప్రారంభించి స్వామివారిని కేకే మహేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ షేక్ సాబేరాబేగం, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, సర్పంచులు కల్లూరు బాపురెడ్డి, మాదాసు స్రవంతి బాబు, నగెల్లి వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు సుడిది రాజేందర్, దేవేందర్, పడగల రవీందర్, భాగ్యరాజ్, కదిర శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, చేకుటి శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, గంట బుచ్చయ్య గౌడ్, నంది కిషన్ పాల్గొన్నారు.

## అక్షర గోల్డ్..కేకే క్యాపిటల్స్ చైర్మన్..

### - కోట కుమార్‌కు యూత్ ఐకాన్ అవార్డు..

**గోదావరిఖని, జనంసాక్షి:**



అక్షర గోల్డ్..కేకే క్యాపిటల్స్ చైర్మన్ కోట కుమార్‌కు యూత్ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డును జూన్ 15న ప్రముఖుల చేతులమీదుగా కుమార్ అందుకోనున్నారని స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీఓ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు.కోట కుమార్ అక్షర స్కూల్స్ స్థాపించడం..అనేకమంది పేద విద్యార్థులకు ఫీజు లేకుండా..తక్కువ ఫీజు, ఇతర స్కూళ్లలో ఇంటర్, డిగ్రీ చదివే పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం..బుక్స్ డొనేట్ చేయడం జరుగుతుంది.చలివేంద్రాలు స్థాపించడం,రక్తదానాలు చేయించడం,కల్చరల్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాములతో తనవంతుగా ఆర్థిక సహాయం అందిస్తున్నారు.పేదింటి ఆడ పిల్లల పెళ్లిళ్లకు సహాయం చేయడం,హాస్పిటల్స్‌లో ఉన్న బాధితులకు సహాయం చేసే గుణం ఉన్న కుమార్ సేవా తత్పరత హృదయం కలిగిన వ్యక్తిగా పారిశ్రామిక ప్రాంతంలో అందరికి సుపరిచితుడు.ఇతరులకు ఆదర్శంగా నిలుస్తూ..చాలామంది జీవితాల్లో సంతోషం నింపుతున్న కుమార్‌కు యూత్ ఐకాన్ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం..

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి..

**గంభీరావుపేట మే 15 (జనంసాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లాగంభీరావుపేట మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి , తోపాటు, బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హనుమాన్లు విచ్చేసి నూతన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారుడు కోట లింగం, తో గృహప్రవేశంలో పాల్గొని కేకే మహేందర్ రెడ్డి లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గత బి ఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇచ్చామని పేరుకే చెప్పుకుంటున్నారు కానీ ప్రతి గ్రామంలో ఇవ్వలేకపోయిందని తెలిపారు, కాంగ్రెస్ ప్రభుత్వ ఆయాంలో ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు ఇయడంతో ఇల్లు నిర్మించుకున్నామని లబ్ధిదారులు తెలిపారు అలాగే నర్మల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కాంగ్రెస్ నాయకులు హమీద్ ఓరుగంటి నర్సింలు లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.



**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఓరుగంటి నర్సింలు ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హమీద్. విచ్చేసి కాంగ్రెస్ నాయకులు కలిసి సీఎంఆర్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేసుకుని వారికి వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులను అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, మండల అధ్యక్షుడు హమీద్, మార్కెట్ డైరెక్టర్, ప్రభాకర్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ మెంబర్లు, లక్కం నాంపల్లి, స్వామి, సోషల్ మీడియా, శేఖర్ శంకర్,రాగుల మహేందర్ గిరిగంటి రాజనర్సు గుండెలు చంద్రం పుల్లు రాజశేఖర్ కర్రల్లో మురళి కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు

# సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ్ సంఘ మండల అధ్యక్షుడు గా గైని నర్సయ్య

**ఇల్లంతకుంట మే 15(జనంసాక్షి )**
రాజన్న సిరిసిల్ల ఇల్లంతకుంట మండలం సోమారంపేట్ గ్రామానికి చెందిన గైని నర్సయ్యకు జిల్లా అధ్యక్షుడు లచ్చులుగారి శ్రీనివాస్ గౌడ్ మండల పాపన్న మొక్కుదెబ్బ అధ్యక్షుడుగా నియామకం పత్రాన్ని అందజేశారు. నియామకపత్రం స్వీకరించిన తర్వాత నర్సయ్య మాట్లాడుతూ ఈరోజు నుండి సంఘ నియమానిబంధల ప్రకారం క్రమశిక్షణతో సర్వాయి పాపన్న వారసులుగా నా గౌడ్ గీత కార్మికుల హక్కుల కొరకు నియమానిబంధన ప్రకారం పనిచేస్తానని నా నియామకానికి సహకరించిన వారందరికీ ధన్యవాదములు తెలిపారు.



# కాంగ్రెస్ నూతన మండల అధ్యక్షునికి నియమక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



## గాంధీభవన్లో ఎమ్మెల్యేను కలిసిన మండల నాయకులు

## గన్నేరువరం మండలంలో సంబరాలు..

గన్నేరువరం, మే 15 (జనంసాక్షి):
కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా బొడ్డు సునీల్ నూతనంగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాదులోని గాంధీభవన్లో మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా గన్నేరువరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియామక పత్రాన్ని బొడ్డు సునీల్ అందుకున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కి సునిల్ పుష్పగుచ్చమిచ్చి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి సంతోష్,అలువాల కోటి, చీమలకుంటపల్లి సర్పంచ్ ప్రకాష్, మండల నాయకులు ఉదయ్,నర్సయ్య,సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

**గన్నేరువరం లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు - పలువురు శుభాకాంక్షలు**

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా బొడ్డు సునీల్ నూతనంగా నియామకమైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గన్నేరువరం మండల కేంద్రంలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పలువురు ప్రముఖులు బొడ్డు సునీల్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు అరికాంతం గోపాల్ రెడ్డి, కర్నే చంద్రయ్య, జంగిటి ప్రకాష్,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి సంతోష్, చొక్కారావు పల్లె ఉప సర్పంచ్ మామిడి జైపాల్ రెడ్డి, ఖాసీంపేట ఉప సర్పంచ్ సంధవేణి ఐలయ్య,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, గన్నేరువరం మండల కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు జెల్లా రాజేశ్వరి, గన్నేరువరం మాజీ ఉప సర్పంచ్ బూర వెంకటేశ్వర్, నాయకులు అలువాల కోటి,నల్ల చంద్ర రెడ్డి, న్యాలపట్ల కనకయ్య గౌడ్ వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు నాణ్యతతో చేయాలి

**చొప్పదండి, మే 15 (జనంసాక్షి):**
చొప్పదండి పట్టణంలో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కాంట్రాక్టర్ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిర్మాణ పనులు నాణ్యత లేకుండా చేస్తున్నారని సంబంధిత అధికారులపై మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత- శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస-గంగయ్య పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను మున్సిపల్ పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ వడ్లూరి సరిత మాట్లాడుతూ పట్టణంలో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు నాణ్యత లేకుండా చేస్తున్నారని నాణ్యతతో పనులు చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులలో భాగంగా పోస్తున్న బీడీ రోడ్డు నాణ్యత లేకుండా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారని తెలిపారు. పాత బీటీ రోడ్డుపై మళ్లీ బీటి రోడ్డు వేస్తే రోడ్డు చెదిరి పోయే ప్రమాదం ఉందని, పాత బీటి రోడ్డు తీసివేసి నూతనంగా పోసే రోడ్డు నాణ్యతతో రోడ్డు పోయాలని కాంట్రాక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. సంబంధిత అధికారులు సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులకు సంబంధించి ప్రొసిడింగ్ కాపి అందించి నిర్మాణ పనులు నాణ్యతతో చేసే విధంగా చూడాలని ఆదేశించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టకపోతే కాంట్రాక్టర్ సంబంధిత అధికారుల పై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం రాజేందర్ రెడ్డి, పిట్టల వెంకటేష్, కొట్టే సునీత- అశోక్, ముద్దం రాజేశ్వరి- తిరుపతి, వడ్లూరి అనుష -శ్యామ్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తోడేటి దేవిడ్, చత్రపతి తదితరులు పాల్గొన్నారు.



# ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

## కలెక్టర్ కోయ శ్రీహర్ష..

**- అదనపు నిధుల మంజూరుకు ఉన్నతాధికారులతో సమన్వయం..**

**- నూతన ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్..**

గోదావరిఖని, జనంసాక్షి:
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.రామగుండంలో నిర్మాణంలో ఉన్న 355 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రారంభంలో రూ.160.3 కోట్లతో ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు పూర్తి చేయడానికి సుమారు రూ.205 కోట్ల వ్యయం అవసరమవుతోందని తెలిపారు.అదనపు నిధుల మంజూరు కోసం సవరించిన అంచనాలతో ఇప్పటికే సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్కు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన అదనపు నిధుల మంజూరు అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా సమన్వయం చేస్తానని తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ పరిశీలనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్సింగ్, సంబంధిత శాఖల అధికారులు, వైద్య అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు హాస్పిటల్ డాక్టర్లు కృపాబాయి, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపు, అన్ లోడింగ్ వేగవంతం చేయాలి :అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**బోయినిపల్లిమే 15 (జనంసాక్షి)**
కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించడం, మిల్లుల్లో ఉన్న వాహనాలు అన్ లోడింగ్ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.శుక్రవారం ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర రైస్ మిల్, రహీంఖాన్ పేట గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం, పొత్తూరు, బోయినిపల్లి మండలం మాన్వాడ, కొదురుపాక, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైస్ మిల్లుల యజమానులకు పలు సూచనలు చేశారు.కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించి తూకం వేసిన బస్తాలను వాహనాల ద్వారా మిల్లులకు వేగవంతంగా తరలించాలని, సంబంధిత కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చి ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకుని సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. తనిఖీలో ఇల్లంతకుంట, బోయినిపల్లి, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్లు షరీపుద్దీన్, సురేష్, సుజాత, తదితరులు ఉన్నారు.



# మహిళ సాధికారత కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి

## టిపిసిసి డెలిగేట్ గంగా శంకర్

**బోధన్, మే 15 ( జనంసాక్షి ) :**
మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు మహిళల కోసం పెద్దపీట వేస్తుందని టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం బోధన్ మండలంలోని కొప్పర్గ, సిద్ధాపూర్ గ్రామాలలో మహిళా మండలి భవన నిర్మాణాలు, సిద్ధాపూర్ లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, చిన్నమావంది గ్రామంలో అంగన్వాడి భవన నిర్మాణంకు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి పెట్టిన మేనిఫెస్టోలో భాగంగా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం అందిస్తుందని త్వరలో మరో పథకానికి సైతం శ్రీకారం చుట్టనుందని ఆయన అన్నారు. అయితే మహిళలు ఎన్నో ఏళ్ల నుండి అడుగుతున్న మహిళ భవన నిర్మాణాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగిందని అందులో భాగంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాలతో నేడు మండలంలోని గ్రామాలలో పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళలు



అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టే విధంగా ముందుకు సాగాలని ఇప్పటికే డ్వాక్రా మహిళలకు పావల వడ్డీ రుణాలు అందించడంతోపాటు రుణాల పరిమితిని సైతం 10 లక్షల వరకు పెంచిన ఘనత కాంగ్రెస్ దక్కుతుందనే విషయాన్ని మహిళలు గమనించాలన్నారు. మహిళల అభివృద్ధి కోసం మునుముందు మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని గంగా శంకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కొప్పర్గ సర్పంచ్ సయ్యద్ అహ్మద్, సిద్ధాపూర్ సర్పంచ్ గంగాసాగర్ విఠల్, చిన్నమావంది సర్పంచ్ శ్రీరామ్ శ్రీనివాస్, కల్దుర్కి సహకార సంఘం చైర్మన్ గింజుపల్లి వేణు, పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ వెంకటేష్, ఏఈ లిఖిత, గణపతి రెడ్డి, ప్రకాష్ పటేల్, కొప్పర్గ గ్రామపంచాయతీ కార్యదర్శి లకావత్ కిరణ్, సిద్ధాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రణవ్ కుమార్, చిన్న మామది పంచాయతీ కార్యదర్శి చిద్రపు రాజేష్, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## లంబడిపల్లే రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కాటం శ్రీనివాస్ రెడ్డి ఎన్నిక.. ఉపాధ్యక్షుడిగా పింగిలి సంపత్ రెడ్డి,హనుమాన్ల కనకరెడ్డి..

**చిగురుమామిడి మే15 (జనంసాక్షి):** మండలం లోని లంబాడిపల్లె గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కాటం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పింగిలి సంపత్ రెడ్డి, హనుమాన్ల కనకరెడ్డి,ప్రధాన కార్యదర్శిగా నల్లాల రఘువర్ధన్ రెడ్డి,ఉపకార్యదర్శిగా కసిడి ప్రశాంత్ రెడ్డి,కోశాధికారిగా హనుమాన్ల రాజిరెడ్డి,డైరెక్టర్లుగా వడియాల ముకుంద రెడ్డి,శ్యామకూర సంపత్ రెడ్డి, జంగా రమణారెడ్డిలను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రెడ్డి సంఘం సభ్యుల సంక్షేమం,ఐక్యత,సంఘం అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు. సంఘం సభ్యుల మధ్య స్నేహభావం,పేద విద్యార్థులకు ప్రోత్సాహం, ఉపాధి,సామాజిక సేవ కార్యక్రమాల్లో సహకారం అందించడం సంఘం ముఖ్య ఉద్దేశం అన్నారు.గ్రామ అభివృద్ధి యువతకు ప్రోత్సాహం అవసరమైన వారికి సహాయం చేయడం వంటి కార్యక్రమాలను రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని చెప్పారు. సంఘం ద్వారా సమాజంలో ఐక్యత సేవ భావం పరస్పర సహకారం మరింత బలపడేలా కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో తమను ఎన్నుకున్న రెడ్డి సంఘం కుల బంధువులందరికీ వారు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కర్ర అశోక్ రెడ్డి,నల్లాల రాజిరెడ్డి,హనుమాన్ల రాజిరెడ్డి,నాగెల్లి వీరారెడ్డి,రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.





# మాట ఇస్తే నిలబెట్టుకుంటాం..!

## బాలికల కళాశాల మైదానాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

**మంథని, ( జనంసాక్షి ) :**
తమది చేతల ప్రభుత్వం అని ఒకసారి మాట ఇస్తే దాన్ని కచ్చితంగా నిలబెట్టుకుని తీరుతామని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక భాగంగా జరిగిన కార్యక్రమంలో చైర్మన్ కళాశాల మైదాన అభివృద్ధికి మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్ లతో కలిసి కళాశాల మైదానాన్ని ఆయన పరిశీలించారు. మైదానంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడం వల్ల ఆటలకు అనుకూలంగా లేదని, తాను మైదానాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి గ్రావెల్ నింపి ఆటలకు అనుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు అవసరమైన నిధులను అంచనా వేయాల్సిందిగా మున్సిపల్ ఏ ఈ మౌనికను ఆదేశించారు. కొద్దిరోజుల్లోనే మైదానంలో పెరిగిన తుమ్మలు , పిచ్చి మొక్కలను తొలగించి అనంతరం గ్రావెల్ నింపుతామన్నారు. మైదానం అభివృద్ధి చేసిన అనంతరం మళ్లీ తానే వచ్చి ప్రారంభిస్తామన్నారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు పెంటరీ రాజు, మారుపాక నిహారిక, జంబోజు సమ్మయ్య ఉన్నారు.

## ఉచిత ఆర్ఒ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**ఇల్లంతకుంట మే 15(జనంసాక్షి )**
ఇల్లంతకుంట వెంకట్రావుపల్లె మార్గంలో ఒగ్గు నర్సయ్య పిల్లింగ్ స్టేషన్లో ఉచిత ఆర్ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు సర్పంచ్లు పాల్గొన్నారు. దీనిని ఉద్దేశించి



వారు మాట్లాడుతూ ఈ మార్గంలో వెళ్లే ప్రజలకు వాటర్ ప్లాంట్ చాల ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ యాజమాన్యం మాట్లాడుతూ, పరిసర ప్రాంతాల ప్రజలందరికి స్వచ్ఛమైన త్రాగునీటిని ఉచితంగా అందిచలానే ఉద్దేశంతోనె వాటర్ ప్లాంట్ ప్రారంభించినట్లు బంక్ యాజమాన్యం తెలిపారు.ఈ కార్యక్రమంలొ వెంకట్రావు పల్లె సర్పంచ్ నవీన్ రెడ్డి జంగంరెడ్డిపల్లి సర్పంచ్ సునీత తిరుపతి గొల్లపల్లి సర్పంచ్ రాడం లక్ష్మి ప్రవీణ్ , ఉప సర్పంచ్ లక్ష్మణ్ తో పాటు నాయకులు పత్రి అంజయ్య , మ్యాక శ్రీనివాస్ , శ్రీనివాస్ , శంకర్ ఇతర స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధితుల అభిప్రాయం తెలుసుకున్న జాయింట్ యాక్షన్ కమిటీ

**జనంసాక్షి గంగాధర**
మండలం నారాయణపూర్ గ్రామంలో ముంపునకు గురవుతున్న బాధితుల అభిప్రాయాన్ని జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు తెలుసుకున్నారు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాన్ని సందర్శించి ముంపు బాధితుల అభిప్రాయాన్ని సేకరించడం జరిగిందన్నారు బాధితుల అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు అందిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్.స్పెషల్ డిప్యూటీ కలెక్టర్.డీపీఓ.రూరల్ ఏసిపి.ఇరిగేషన్ ఏఈ.ఎంపీడీఓ.ఎస్ఐ.గ్రామ సర్పంచ్ దీకొండ బాబ లక్ష్మి మధు.మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వీణవంక క్రీడా పోటీలలో గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలి



**వీణవంక మే15 (జనం సాక్షి)**
వీణవంక క్రీడా పోటీలలో క్రీడాకారులు గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలని,క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి,సర్పంచ్ దాసారపు సరోజన–రాజేంద్ర ప్రసాద్ అన్నారు.వీణవంక మండల కేంద్రంలోనీ జడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానంలో శివాజీ యూత్,8వ వార్డు సభ్యులు బోగం అనిల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ను ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ ఆవుల తిరుపతి,సర్పంచ్ దాసారపు సరోజన– రాజేంద్ర ప్రసాద్ లు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా పోటీలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత క్రీడా మైదానంలో సమయాన్ని కేటాయించడం వలన శారీరక,మానసిక ఉల్లాసంతో పాటు భవిష్యత్లో రాణిస్తారని తెలిపారు.సెల్ ఫోన్ లకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని క్రీడలు నిర్వహించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాళ్ళపెల్లి మహేశ్, వోరెం భానుచందర్, పంచాయితీ కార్యదర్శి యశోద,వార్డు సభ్యులు గెల్లు కుమార్,నీల శ్రీకాంత్, ఆర్గనైజర్లు గుర్రం రంజిత్, తాటికొండ శ్రావణ్,క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.

# సాలూర జిల్లా పరిషత్ పాఠశాలలో లైబ్రరీ డే

## లైబ్రరీని ప్రారంభించిన సర్పంచ్ సొక్కం లావణ్య రవి

**బోధన్, మే 15 ( జనంసాక్షి ) :**
ప్రజా పాలనలో భాగంగా సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన లైబ్రరీ డే లో భాగంగా శుక్రవారం గ్రామ సర్పంచ్ సొక్కం లావణ్య రవి చేతుల మీదుగా లైబ్రరీని ప్రారంభించారు. ఈ మేరకు బ్రెడ్ సొసైటీ ద్వారా అందించిన 650 కథా పుస్తకాలను, ప్రభుత్వ అందించిన హిందూ మ్యాగ్జిన్ లను వివిధ పుస్తకాలతో



ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, లైబ్రరీలో ఉన్న పుస్తకాలను చదివి మంచి జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. పుస్తకం చదివే అలవాటు చేసుకుని విద్యార్థి దశనుండే ఉన్నత స్థాయి వరకు ఎదిగే విధంగా పుస్తక పఠనం ఉండాలన్నారు. విజ్ఞాన సముదాయంతో కూడిన లైబ్రరీని ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారిని రాజీ మంజూష మాట్లాడుతూ, పుస్తకాలు చదవడం అన్నది జీవితంలో నేర్చుకునే అతిపెద్ద విషయం అని, పుస్తకాలు అనేక పరిస్థితులు ఎలా ఎదుర్కోవాలి నేర్పిస్తాయన్నారు. పుస్తకాలు మన భవిష్యత్తుని మార్చేస్తాయని తెలియజేస్తూ ప్రతిరోజు కనీసం ప్రతివారం ఒక కొత్త పుస్తకం చదివేలా అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా గ్రంథాలయం సాలూర శాఖను సందర్శించి అందుబాటులో ఉన్న పుస్తకాలను సమయాలను గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

**కామారెడ్డి ప్రతినిధి, మే 15 (జనంసాక్షి)**
ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, స్థానికంగా గ్రంథాలయ దినోత్సవం మరియు పుస్తక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి



మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుస్తకాల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు యువత పఠన అలవాట్లను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు మాత్రమే కాదని, అవి జ్ఞాన వికాసానికి ప్రధాన కేంద్రాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పుస్తకాల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ కాసార్ల గోదావరి స్వామి ,స్థానిక కౌన్సిలర్ గ్యార అఖిల, డీఈవో రాజు, ఎంఈవో ఎల్లన్న, గ్రంథాలయ కార్యదర్శి వంశీ కృష్ణ, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

# మోసకారితనం



**ముస్తాబాద్ మే 15 జనంసాక్షి**

రైతే దేశానికి వెన్నెముక అని ఘనంగా ప్రసంగాలు దంచే మోడీ ప్రభుత్వం, ఆచరణలో అన్నదాతలను అడుగడుగునా ఆశాభంగానికి గురిచేస్తోంది. పెట్టుబడులు, ఎరువుల ధరలు ఏటేటా 20 - 30 శాతానికి పైబడి పెరిగిపోతుంటే, కనీస మద్దతు ధరల ప్రకటన మాత్రం ఇంకా అరకొరగానే అఘోరిస్తోంది. నాడు కేంద్ర ప్రభుత్వం 13 రకాల పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు కంటితుడుపు చర్య కన్నా అధ్వానం. వాస్తవ పరిస్థితుల పట్టింపు లేకుండానే ఏదో బితూతూమంత్రపు తంతుగా ఉంది. రెండు వారాల క్రితం ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిన లెక్కలు తాజాగానే ఉన్నాయి. ఆ భారాన్ని తట్టుకునే స్థాయిలోనైనా పంటలకు కనీస మద్దతు లేకపోవటం రైతుల పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని, నిర్వ్పాచీతనాన్ని తేటతెల్లం చేస్తోంది. 2026-27 సీజనుకు గానూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు క్షేత్రస్థాయి పరిశీలనను గానీ, రైతు సంఘాల విజ్ఞప్తులను గానీ కొంతమాత్రంగానైనా ప్రతిబింబించటం లేదు. గతేడాదితో పోలిస్తే ఎరువులు, పురుగుల మందుల ధరలు 30 శాతం దాకా పెరిగాయి. ట్రాక్టరు, ఇతర యంత్ర ఉపకరణాల నిర్వహణ వ్యయం, అద్దెలూ పెరిగాయి. త్వరలో డీజిలు ధర పెరగనుందన్న వార్తలు వస్తూనే ఉన్నాయి. అమెరికా సృష్టించిన యుద్ధ బీభత్సం ఇప్పటికే ఎరువులు, ఇతర సామగ్రి ప్రియం అయిపోవటానికి కారణమైంది. ఎల్ నినో పరిస్థితులు ఏర్పడి, ఈ ఏడాది వర్షపాతం తగిన స్థాయిలో ఉండక పోవొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రైతాంగం పట్ల ప్రేమ ఉన్న ఏ ప్రభుత్వమైనా ఏం చేయాలి? దేశంలో 60 శాతం గ్రామీణ ప్రాంతానికి ఆదరువుగా నిలుస్తున్న వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలవాలి. రైతుకు భరోసా ఇచ్చే సహాయ సహకారాల ప్రణాళికతో ముందుకు రావాలి. కానీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ రైతులను మార్కెట్టుకు, పరిస్థితులకు వదిలేసి, చోద్యం చూస్తున్నాయి. కాబట్టే, ఇప్పటికే యుద్ధం కారణంగా నెలకొన్న పరిస్థితులకు వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోయి, మన రైతులు దారుణంగా నష్టపోయారు. దానికి ముందు అమెరికా విధించిన టారిఫ్‌లకూ అన్నదాతలు బలయ్యారు. అప్పుడూ, ఇప్పుడూ మోడీ ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోంది తప్ప, రైతులను ఆదుకునే ఆచరణకు పూనుకోలేదు. అలాంటి స్పృహ కొంత ఉన్నా, క్వింటా ధాన్యానికి గతేడాది కన్నా రూ.72లు మాత్రమే పెంచి, చేతులు దులుపుకొని ఉండేది కాదు. మొక్కజొన్నకు రూ.10 లు, పెసలుకు రూ.12 లు మాత్రమే విదిల్చి ఉండేది కాదు. కొన్ని పంటల ధరలు వందల్లో పెంపు కనిపిస్తున్నా, పెరిగిన ఖర్చుతో పోలిస్తే మద్దతు అనేది ప్రహసనంగానే అనిపిస్తోంది. నిజానికి ఆహార పంటల సాగు చాలా కాలంగా సంక్షోభంలో ఉంది. స్వామినాథన్ కమిషన్ సూచించిన మద్దతు ధర ఫార్ములా సి2 ప్లస్ 50 శాతం అనేది అమలు చేస్తే కొంతలో కొంత ఊరట. రైతు వివిధ రూపాల్లో పెట్టిన పెట్టుబడిని, ఇంటిల్లిపాది శ్రమను సాగు వ్యయంగా లెక్కించి, దానికి 50 శాతం జోడించి- పంట ధర నిర్ణయించాలనేది ఈ ఫార్ములా సారాంశం పాలకులు దీనిని పట్టించుకోకపోగా, సాగు భారాన్ని మరింత పెంచే చర్యలు చేపడుతున్నారు. గతేడాది మోడీ ప్రభుత్వం ఎరువుల సబ్సిడీకి బడ్జెట్లో కేటాయించిందే తక్కువ అనుకుంటే, ఆ తరువాత 16 వేల కోట్ల మేర నిధులకు కోత పెట్టింది. అలాగే, మద్దతు ధరల అమలుపై ఎలాంటి పర్యవేక్షణా చేపట్టకుండా మార్కెట్ శక్తుల ఇష్టానుసారానికి వదిలేస్తోంది. లోపభూయిష్టమైన, నిర్లక్ష్యపూరితమైన ఈ బాధ్యతారాహిత్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ స్వస్తి పలకాలి. అభివృద్ధి చెందిన దేశాలు వ్యవసాయోత్పత్తులకు పెద్దఎత్తున రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చి ముందుకు సాగుతుంటే, భారత రైతాంగానికి భారాల ముకుతాడు వేయటం దారుణం. దేశ సౌభాగ్యానికి, ఆరోగ్యానికి రైతు ఒక కీలకమైన పాత్రధారి అని గుర్తించి, వ్యవసాయ రంగాన్ని బలంగా నిలబెట్టటానికి చిత్తశుద్ధితో వ్యవహరించాలి. గట్టి చేతలు లేని ప్రతి వట్టి మాటా మోసకారితనంగానే మిగులుతుంది.

## టీజీఎస్ ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పణ

**కరీంనగర్ టౌన్, మే 15 ( జనంసాక్షి)**

కరీంనగర్ రీజియన్ పరిధిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి సంబంధించి టీజీఎస్ ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్‌ను కలిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలోని అంశాలపై ఆర్ఎం సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రంలో రొటేషన్ డ్యూటీ చార్జీలు అమలు చేయడం, పెండింగ్‌లో ఉన్న యూనిఫామ్, స్టిచ్చింగ్ చార్జీల చెల్లింపు, నాణ్యమైన విడిభాగాలు ,మెకానిక్‌లకు అవసరమైన టూల్స్ అందించడం వంటి డిమాండ్లు ప్రస్తావించారు. అలాగే టార్గెట్ ఇన్సెంటివ్ ఎత్తివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, డ్రైవర్లు, కండక్టర్లకు ఇన్సెంటివ్ పెంచాలని కోరారు. ప్రభుత్వ వైద్యులు ఇచ్చిన సిక్ సర్టిఫికెట్లకు సిక్ లీవులు మంజూరు చేయాలని, డబుల్ డ్యూటీల పేరుతో డ్రైవర్లు, కండక్టర్లను వేధించవద్దని, ఖాళీగా ఉన్న పోస్టులను రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదనంగా గుడ్ అండ్ అటెండెన్స్ అలవెన్స్ విడుదల, జూనియర్ అసిస్టెంట్ పోస్టింగులు, అర్హులైన వారికి ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్ అప్పీళ్ల పరిష్కారం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కరీంనగర్ రీజియన్ కమిటీ గౌరవాధ్యక్షులు జి. రాజేశం, రీజినల్ కార్యదర్శి వీరగోని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పుల్లెల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

**○మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి..**

**○సీ.సీ,రోడ్డు పునః నిర్మాణ పనులు ప్రారంభం..**

**సిరిసిల్ల టౌన్ మే 15 (జనంసాక్షి)**

అభివృద్ధిలో భాగంగా సి,సి,రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి తెలిపారు. సిరిసిల్లలోని మూడవ వార్డు విద్యానగర్ చౌరస్తాలో అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్డు పునః నిర్మాణ పనుల్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూసిద్దిపేట మెయిన్ రోడ్డు మీదగా విద్యానగర్, అంబేద్కర్ నగర్,శాంతి నగర్ ఇలా పలు వార్డుల ప్రజల రాకపోకలకు నిత్యం ఉపయోగించేమూడవ వార్డ్ లోని మెయిన్ రోడ్డు శిథిలావస్థకు చేరుకోగా గత మున్సిపల్ పాలకవర్గం సమయంలో సమస్యను బి,ఆర్,ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రత్యేక నిధుల ద్వారా ఈ రోడ్డు నిర్మాణానికి 6 లక్షల రూపాయలు విడుదల చేయించారని తెలిపారు. అయితే మొదట అనుకున్న దానికంటే ఈ రోడ్డు నిర్మాణ పనుల అంచనా విలువలు 6 లక్షల రూపాయలకు మించి అవసరం ఉండడంతో మున్సిపల్ జనరల్ నిధుల నుండి మరో మూడు లక్షల రూపాయలను కెటాయించుకొని పూర్తిస్థాయిలో ఈ రోడ్డును నిర్మించడం కోసం నిర్మాణ పనులను ప్రారంభిస్తూ, భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మూడవ వార్డు లో రోడ్లు, మురికి కాలువలు పూర్తిస్థాయిలో నిర్మించేలా మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించేలా భవిష్యత్ ప్రణాళికను చేపడతామని,ప్రజల సంక్షేమం పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పాలనలో ముందుకు సాగుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్, డి ,ఈ,ఓ వాణి, పంచాయతీరాజ్ ఏఈ అజారుద్దీన్, మామిడాల కృష్ణ, కట్ల సత్యనారాయణ, వంకాయల కార్తీక్, ఫ్యాక్స్ డైరెక్టర్ గడిల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిప్పలపల్లిలో భారత్ అభియాన్ హెల్త్ క్యాంపు



**ముస్తాబాద్ మే 15 (జనంసాక్షి)**

ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మా చెట్టి లక్ష్మణ్ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. మండల వైద్య అధికారి హఫీజ్ గ్రామ ప్రజలకు టీబీ క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు నివారణ చర్యలు చికిత్స విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సువర్ణ, మైపాల్, కే ఉదయ్ కుమార్ రజిత, ఏఎన్ఎం వసంత, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల అరెస్ట్



**కరీంనగర్ టౌన్ మే 15 ( జనంసాక్షి)**

కరీంనగర్ లో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ పిలుపు మేరకు సీఎం ఇల్లు ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజామున కరీంనగర్ జిల్లా జేఏసీ చైర్మన్ బొత్త వెంకటమల్లయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నగర అధ్యక్షుడు గోడిశల రమేశ్ గౌడ్‌లను కరీంనగర్ ఎఎ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు నివాస స్థలాలు, పెన్షన్, ఆరోగ్య కార్డులు తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రకటించి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ఉద్యమకారులను మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వాల మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా తెలంగాణ ఉద్యమకారులను విస్మరిస్తోందని విమర్శించారు. స్వరాష్ట్ర సాధన కోసం తమ సమయాన్ని, శక్తిని వెచ్చించిన తెలంగాణవాదులకు న్యాయం చేయకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను అణచివేయలేరని, ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీల అమలు ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా విస్తరిస్తామని హెచ్చరించారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

### గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ సేవలు అభినందనీయం

**ఇల్లందకుంట, మే 15 (జనంసాక్షి)**

ఇల్లందకుంట మండల కేంద్రంలో లోని గ్రామపంచాయతీ లో గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఫౌండర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని తెలిపారు. శుక్రవారం రోజున ఇల్లందకుంట గ్రామంలో గంగిశెట్టి మధురమమ్మ మెమోరియల్ ట్రస్ట్ హుజురాబాద్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరము గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించమని ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ తెలిపారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ధారా సురేష్ ప్రారంభించి అనంతరము వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ శిబిరంలో శ్రీనివాస విజన్ సెంటర్ హుజురాబాద్, మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్ మరియు శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్ హనుమకొండ వారు పాల్గొని 196 మందికి ఉచితంగా బీపీ, షుగర్, ఈసిజి కంట మరియు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి ఉచితంగా మందులు, కంటి చుక్కల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మరియు 19 మందికి కంట్లో పొరలు ఉన్నట్లు గుర్తించి వారికి ఉచిత కంటి ఆపరేషన్ చేపిస్తామని కంటి పరీక్ష నిపుణులు శ్రీనివాస తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న డాక్టర్స్ కు మరియు సిబ్బందికి మధురమ్మ ట్రస్టు వారు శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ శిబిరంలో హాస్పిటల్స్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు కారోబార్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట హాజరైన డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్



**కామారెడ్డి ప్రతినిధి, మే 15 (జనంసాక్షి)**
గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతిపక్ష నేతలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టుల ఫోన్లు అక్రమంగా ట్యాప్ చేసినట్లు వెలుగులోకి వచ్చిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను వేగవంతం చేసింది.
ఈ కేసులో భాగంగా కామారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్‌కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేయగా, ఆయన శుక్రవారం హైదరాబాద్ కమాండ్, కంట్రోల్ టవర్స్‌లోని సిట్ కార్యాలయంలో హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు, గంప ప్రసాద్ సిట్ ఎదుట హాజరై తమ వాంగ్మూలాన్ని ఇచ్చారు.
ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు, ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన అనుమానాలు, వ్యక్తిగత సమాచారం లీక్ అంశాలపై అధికారులు ప్రశ్నలు అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణ అనంతరం గంప ప్రసాద్ మాట్లాడుతూ..నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని సిట్ అధికారులు చెప్పే వరకు నాకు తెలియదు. ఫోన్ ట్యాపింగ్ వల్ల నా వ్యక్తిగత సమాచారం బహిరంగమై, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగింది. అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను. నా వాంగ్మూలాన్ని వారు రికార్డు చేసుకున్నారు అని తెలిపారు. గంప ప్రసాద్ వెంట సిట్ కార్యాలయానికి పీసీసీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్, మండల అధ్యక్షులు నౌసిలాల్ నాయక్, అంకం కృష్ణారావు, పల్లె రమేష్ గౌడ్, పాత రాజు, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, సుతారి రమేష్, మహమ్మద్ సలీం, కిరణ్, రవీందర్ గౌడ్, వడ్ల సురేష్, టింకు భరత్, ఎజాస్, సుఫియాన్, డేవిడ్, రింకు తదితర కాంగ్రెస్ నాయకులు వెళ్లి సంఘీభావం తెలిపారు.

# గ్రంథాలయ దినోత్సవం

**శంకరపట్నం మే 15 (జనంసాక్షి):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, విద్యా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కేశవపట్నం గ్రంథాలయం లో గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఇంచార్జి ఎంపీడీఓ కె. ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలని సూచించారు. సర్పంచ్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ “గ్రంథాలయం దేవాలయం వంటిదని, ప్రతి విద్యార్థి ప్రతిరోజూ పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని” అన్నారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు తనవంతుగా పది శాశ్వత గ్రంథాలయ సభ్యత్వాల ఫీజును చెల్లించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రాఘవరెడ్డి, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మాధవి, గ్రంథాలయ సూపర్వైజర్ సముద్రాల సంపత్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఉపసర్పంచ్ విజయ్‌కుమార్, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్ఠాత్మకంగా పెన్షన్ అతేంటికేషన్ కార్యక్రమం

## గడువు మే 15 నుండి జూన్ 15 వరకు 30 రోజులు..

## మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి..



**జమ్మికుంట, మే 15 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న పెన్షన్ అతేంటికేషన్ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినట్లు జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తారీకు నుంచి వచ్చే నెల 15వ తారీకు వరకు 30 రోజుల గడువులో లబ్ధిదారులు అయినటువంటి వృద్యాప పింఛను, వికలాంగుల పెన్షన్, వితంతు పెన్షన్, చేనేత పెన్షన్, కల్లుగీత కార్మికుల పెన్షన్, ఒంటరి మహిళ పెన్షన్ ,ఇతరత్ర పెన్షన్లకు సంబంధించినటువంటి లబ్ధిదారులు తమ ఆధార్ కార్డును తీసుకొని మీ వార్డ్ ఆఫీసర్లను కలిసి నట్లయితే వారు తమ మొబైల్ లో లైవ్ అతేంటికేషన్ వాళ్ల ఫేస్ అతేంటికేషన్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని మీ వార్డులలో అందుబాటులో ఉన్నటువంటి వార్డ్ ఆఫీసర్స్ మీకు నమోదు చేస్తారన్నారు. మీరందరూ ఆ వార్డ్ లోని ఒక స్థలంలోనికి వచ్చి సర్వేను చేయించు కోవాలని ఆయన కోరారు. రాబోయే రోజులలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పెన్షన్ లు సక్రమంగా అందించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పెన్షన్ దారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మానవత్వం చాటుకున్న వ్యాన్ డ్రైవర్..



**ముత్తారం మే 25(జనంసాక్షి):**
వ్యాన్ డ్రైవర్ తాటి చందు మానవత్వాన్ని చాటుకున్నాడు. తను వ్యాన్ డ్రైవింగ్ చేస్తూ మంథని నుండి ఓడేడ్ గ్రామానికి వెళ్తున్న సమయంలో ముత్తారం సమీపంలోని కాసార్ల గడ్డ వద్ద రోడ్డు పక్కన పడి ఉన్న సెల్ ఫోన్ ను గమనించిన చందు నిజాయితీతో వ్యవహరించి, వెంటనే ముత్తారం పోలీస్ స్టేషన్కు వచ్చి ఆ ఫోన్ ఎస్సై ఎన్ రవికుమార్ కు అప్పగించారు. ఎస్సై విచారణ చేపట్టి,ఆ సెల్ ఫోన్ కేషన్ పల్లి గ్రామానికి చెందిన మాకోటి సతీష్ అనే రైతుకు అప్పగించారు. విలువైన సెల్ ఫోన్ యథావిధిగా ఉండడంతో సంతోషించిన ఆ రైతు పోలీసులకు,వ్యాన్ డ్రైవర్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంలో వ్యాన్ డ్రైవర్ చందును ఎస్సై అభినందించారు. ఇలాంటివి సమాజానికి ఆదర్శమన్నారు. మానవత్వం,నిజాయితీతో వ్యవహరించే ప్రతి ఒక్కరిని పోలీస్ శాఖ గౌరవిస్తుందని అయన పేర్కొన్నారు.



# పలు కుటుంబాలను పరామర్శించిన కొండూరి రవీందర్రావు..

**గంభీరావుపేట మే 15(జనంసాక్షి);**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ఇటీవల గాయపడ్డ, మాజీ కోఆప్షన్ కుమారుడు మహమ్మద్ హాది ల్, కలకుంట్ల ముత్యంరావు, కలకుంట్ల కిషన్ రావు లను మరియు ఈ మధ్యకాలంలో బోదరికాలువలో పడి మరణించిన, ఎండి నజీర్, కలకుంట్ల రామారావు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు, బిఆర్ఎస్ నాయకులు, వెంకటస్వామి గౌడ్ ,వారితోపాటు, ఉప సర్పంచ్, కమలాకర్ రెడ్డి, వార్డు సభ్యులు, ఎగదండి స్వామి, రెడ్డి మల్ల రాజనర్సు, శ్రీమతి, చిలక ప్రశాంత్, చీరాల లహరిక, బిఆర్ఎస్ నాయకులు, వారి వెంట ఉన్నారు.

# ఘనంగా రసమయి జన్మదిన వేడుకలు



**శంకరపట్నం మే 15 జనంసాక్షి**
కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం మాజీ శాసన సభ్యుడు రసమయి బాలకిషన్ జన్మదినాన్ని పురస్కరించుకొని శంకరపట్నం మండల కేంద్రంలో శుక్రవారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జెడ్పిటిసి లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడులు..

## రెండు ట్రాక్టర్లు సీజ్



**కరీంనగర్ రూరల్, మే 15 ( జనంసాక్షి)**
కరీంనగర్ రూరల్ పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై చర్యలు చేపట్టి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. శుక్రవారం గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో చేగుర్తి గ్రామానికి చెందిన ఎలకపెల్లి సందీప్, బొడ్డు శ్రీకాంత్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా బొమ్మకల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మరియు చేగుర్తి గ్రామం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెక్ట్ షీట్లు కూడా తెరవబడతాయని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.



# భిక్కనూరులో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

**భిక్కనూరు మే 15 (జనం సాక్షి మండల ప్రతినిధి)**
మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి నివేదిక ‘99’ రోజుల కార్యాచరణలో భాగంగా భిక్కనూరు గ్రంథాలయంలో శుక్రవారం రోజున గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి గ్రామసర్పంచ్ శ్రీమతి బల్యాల రేఖ సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి పాల్గొని వారు మాట్లాడుతూ,పుస్తకపఠనం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ క్రమంలో ఉపసర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తాటిపాముల లింబాద్రి,వైస్ చైర్మన్ అందే దయాకర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి కే.మహేష్ గౌడ్ ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు,విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. గ్రంథాలయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ వారోత్సవాలు ఆకట్టుకున్నాయి.

# రెడ్డి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డికి యాదవుల ఘన సన్మానం

**చిగురుమామిడిమే15 (జనంసాక్షి):**
మండలంలోని లంబడిపల్లె రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కాటం శ్రీనివాస్ రెడ్డిని యాదవ సంఘం అధ్యక్షులు చందబోయిన సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తునే,గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు చందబోయిన సంపత్ యాదవ్, ఉపసర్పనీచ్ నక్క ఓదెలుయాదవ్,నక్క నాగరాజు,నక్క ఓదయ్య, చందబోయిన ఎల్లయ్య,నక్క వెంకయ్య,సందబోయిన శ్రీనివాస్, సందబోయిన రాజు,చందబోయన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

